క్లుప్తంగా

పొలిటికల్ ఫ్రంట్ అభ్యర్థిగా జన్ను సాంబయ్య



నర్సంపేట : పట్టణానికి చెందిన జన్ను సాంబయ్యను సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ దాసరి అజయ్‌కుమార్ గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా సాంబయ్య మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రత్యామ్నాయంగా సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఏర్పాటైందన్నారు. దొరల చేతిలో బందీ అయిన తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజలు అధిక మెజార్టీతో తనను గెలిపించాలని సాంబయ్య కోరారు.

సన్మానం



సంగెం : మండలంలోని ఎల్గూర్‌రంగంపేటకు చెందిన కాగితాల రమణాచారి–రజిత దంపతుల రెండో కుమారుడు నీరోష్ ఇటీవల ప్రకటించిన ఆర్మీ పరీక్ష ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. గురువారం గ్రామ యువకానుక టీం ఆధ్వర్యంలో నిరోష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనగాం శ్రీనివాస్, కాగితాల పరమాత్మాచారి, బోనాల యాదగిరి, ముజ్జిగ అనిల్, సాంబరాజు మహేష్, యువకానుక సభ్యులు పసునూటి అశోక్, బొమ్మల శంకర్, ఇమ్మడి సుమన్, చింతల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నర్సంపేట : నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా గుంటి వీరప్రకాష్‌ను నియమించారు. ఈ మేరకు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి వీరప్రకాష్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వీరప్రకాష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు మాధవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, చింతల సాంబరెడ్డి, ఓర్సు తిరుపతి, నూనె పద్మ, మాదాసి రవి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



నర్సంపేట : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పట్టణంలోని పదో వార్డు పోచమ్మ గుడి వద్ద స్థానిక కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం మహాచండీ యాగం, అన్నదాన నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ముఖ్య నాయకులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

ధ్యాన మందిరం ప్రారంభం



గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్‌లో బ్రహ్మకుమారీల ధ్యాన మందిరాన్ని గురువారం ప్రారంభించారు. కీర్తినగర్ బ్రహ్మకుమారీల శాఖ 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు సుంకరి శివ, కీర్తినగర్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోరుకంటి లక్ష్మణరావు, వజినేపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి రాజు, తోట రవీందర్, శ్రీధర్, కనకరాజు, బ్రహ్మకుమారీలు,కాలనీవాసులు పాల్గొన్నారు.

చేయూత



రాయపర్తి : మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన ఐత యాకూబ్(యాకయ్య) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం అతనితో కలిసి చదివిన స్నేహితులు పరామర్శించారు. అనంతరం స్నేహితుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. 50 కిలోల బియ్యంతోపాటు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, చెరుకు రవి, గాదె రవీందర్‌రెడ్డి, యూసుఫ్, మహబూబ్‌రెడ్డి, భిక్షపతి, జేరిపోతుల కుమారస్వామి, ఐత సారయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



నర్సంపేట: సమావేశంలో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గాన్ని ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ క్లస్టర్ బాధ్యులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు రమ్మంటే పక్క నియోజకవర్గాలకు పారిపోయారన్నారు. అభివృద్ధిని 10 సంవత్సరాలు అడ్డుకున్న నాయకులు మళ్లీ తనపై పోటీ చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గం పూర్తిస్థాయిలో అభివృద్ధి జరగాలంటే మళ్లీ తనను ఆశీర్వదించాలని వేడుకున్నారు. సమావేశంలో ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, నల్ల మనోహర్‌రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

నర్సంపేటలోని 12వ వార్డు కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రాయిడి రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే పెద్దితోనే అభివృద్ధి సాధ్యం'

ఖానాపురం : నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితోనే సాధ్యమని ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి, ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు భద్రు తండా, బుధరావుపేట, వేపచెట్టు తండాతో పాటు పలు గ్రామాల్లో గురువారం కార్యకర్తల సమావేశాలు, ప్రచారం చేపట్టారు. వెంకటనర్సయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చెన్నారావుపేట : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ భూక్యా వీరన్న అన్నారు. ఈ మేరకు మండలంలోని పాత ముగ్దుంపురంలో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. సర్పంచ్ సుంకరి లావణ్య,సాంబయ్య, బషీర్, రమేశ్, మల్లయ్య, రాజు తదితరులు ఉన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వం

- పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు



పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న వరదరాజేశ్వర్‌రావు

వర్ధన్నపేట : బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు అన్నారు. గురువారం మండలంలోని బొక్కల గూడెంలో బీఆర్‌ఎస్, బీజేపీలకు చెందిన రెండు వందల మంది కార్యకర్తలు వరదరాజేశ్వర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను గ్రామ గ్రామాన ప్రచారం చేయడం వల్ల ఎంతో స్పందన వచ్చిందన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్‌ను నమ్మే స్థితిలో లేరన్నారు. బీఆర్‌ఎస్ అవినీతి పాలన అంతం కావాలని ప్రజలు గాఢంగా కోరుకుంటున్నారన్నారు. నీళ్లు, నియామకాలు అని యువకులను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తే అది నెరవేరుస్తుందని ప్రజల్లో విశ్వాసం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సమ న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కి శ్రీకాంత్, చిదుముల భాస్కర్, నల్లతీగల రవి, తాళ్లపెల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఓటు హక్కు లేని మైనర్లకు బీఆర్‌ఎస్ కండువా కప్పి పార్టీలో చేరారని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



నర్సంపేట: కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దొంతి మాధవరెడ్డి

- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట/ ఖానాపురం/ చెన్నారావుపేట / నెక్కొండ / దుగ్గొండి: కాంగ్రెస్ పాలనలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు మండలంలోని బుధరావుపేటలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది.. అబద్ధాలు ఆగిపోయాయని మాధవరెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాలకు వచ్చే పరిస్థితి లేదన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన ఆరు నెలల్లోనే అభివృద్ధి ప్రారంభమవుతుందన్నారు. నర్సంపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం చెన్నారావుపేట మండలం ఎల్లయ్యగూడెం గ్రామ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు నూకల ముత్తయ్య, భాషబోయిన చక్రపాణి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. అలాగే చెన్నారావుపేట మండలంలోని కోనాపురం, లింగాపురం, పుల్లయ్యబోడు తండాతో పాటు పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

నెక్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని దొంతి ప్రారంభించి, మాట్లాడారు. అనంతరం మండలంలోని చంద్రుగొండ, ముదిగొండ, పెద్దకొర్పోలు, వెంకట్ తండా, పిట్టకాలుబోడు తండా, తోపనపల్లి గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దొంతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నల్లబెల్లి మండలం మూడుచెక్కలపల్లి గ్రామానికి చెందిన 33మంది, మేడపల్లి మాజీ సర్పంచ్ బాదావత్ రవిలు దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దుగ్గొండి మండలంలోని రేకంపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు దొంతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు బాసటగా నిలవాలి



కేసీఆర్ ఫొటోతో ప్రచారం చేస్తున్న దివ్యాంగులు

దుగ్గొండి : దివ్యాంగులకు ఆసరాతో అండగా నిలిచిన సీఎం కేసీఆర్‌కు ప్రతి దివ్యాంగుడు బాసటగా నిలవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక మండల అధ్యక్షుడు చింత కుమారస్వామి అన్నారు. మండలంలోని ముద్దునూరులో గురువారం దివ్యాంగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం కేసీఆర్ చిత్రపటాన్ని మూడు చక్రాల వాహనానికి ఏర్పాటు చేసుకుని ప్రచారం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. దుడ్డె జీవన్, కందికొండ రాజుకుమార్, ఎండీ బాబు, తోకల సంపత్, రేణుకుంట్ల సరిత, జనగాం నాగమణి, బండి కుమారస్వామి పాల్గొన్నారు.

గో సంరక్షణ అందరి బాధ్యత

- గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్



లేగదూడలను పంపిణీ చేస్తున్న మహేష్‌అగర్వాల్

రాయపర్తి : గో సంరక్షణ అందరి బాధ్యత అని , గోవులను పూజించాలని తెలంగాణ గోశాలల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్‌అగర్వాల్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శివశక్తి గోశాల ఆధ్వర్యంలో పదిమంది రైతులకు 20 లేగదూడలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ.. గోవుల మూత్రం, పేడతో సేంద్రియ ఎరువులను తయారు చేసి తక్కువ పెట్టుబడితో ఆరోగ్యదాయకమైన పంటలను పండించవచ్చన్నారు. గోవులను కాపాడుకునే బాధ్యత రైతులపై ఉందన్నారు. గోవులతో వ్యవసాయం చేయడం వల్ల భూసారం పెరుగుతుందని, ఖర్చులు కూడా తగ్గుతాయని అన్నారు. ఆఫీస్ సూపరింటెండెంట్ దుర్గం రోజా, కిరణ్, సర్పంచ్ లకావత్ సమ్మక్క భాస్కర్, గోశాల ప్రతినిధులు మాంజ్యా, భాస్కర్, రైతులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మలేరు'



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఖానాపురం : కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని బీజేపీ జిల్లా అధికారి ప్రతినిధి మాచర్ల దేవేందర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజుయాదవ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల కోసం, ప్రజా సమస్యల మీద పోరాటం చేయని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ముందు వస్తే ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ అభ్యర్థి ప్రకటన తర్వాత కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ఖాళీ కాబోతున్నాయన్నారు. ఇరు పార్టీల నాయకులు కార్యకర్తలను కాపాడుకోవాల్సిన పరిస్థితి రాబోతుందన్నారు. సొంత పనుల కోసమే ఓ నాయకుడు బీజేపీలో చేరాడని, పనులు పూర్తి అయిన తర్వాత వెళ్లిపోయాడన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి జల్లి మధు, లింగబత్తుల యాకస్వామి, రమేష్, ముకేష్, నరేష్, లక్ష్మినారాయణ, కుమారస్వామి, నరేష్, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భా...రీ యంత్రాలు!



వర్ధన్నపేట : భారీ యంత్ర పరికరాలు, ట్యాంకర్లతో మూడు లారీలు వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై గురువారం వెళ్తుండడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ భారీ యంత్రాలను గుజరాత్ రాష్ట్రం నుంచి ఒడిశాకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో తొర్రూరు వైపునకు వెళ్తున్న ఈ భారీ వాహనాలకు సుమారు 30 మంది దారి పొడవునా చెట్లు, విద్యుత్ తీగలను పైకి ఎత్తుతూ చెట్ల కొమ్మలను తొలగించుకుంటూ గమ్యస్థానానికి చేరడానికి చేస్తున్న వ్యయ, ప్రయాసాలు అంత ఇంతా కాదు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



ఎలుకుర్తిలో మాట్లాడుతున్న భాస్కరాచారి

గీసుకొండ : బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన ఖర్చు తగ్గించుకుని అధిక మొత్తంలో పొదుపు చేసుకోవాలని లీడ్ బ్యాంకు ఎఫ్ఎల్‌సీ, యూనియన్ బ్యాంకు కౌన్సిలర్ భాస్కరాచారి అన్నారు. గురువారం మండలంలోని ఎలుకుర్తిహవేలి రైతు వేదికలో ధరణి స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కల్లెపు శోభారాణి ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంకు డీఈఏ ఫండ్ స్కీం ద్వారా పొదుపు సంఘాల మహిళలు, యువకులకు ఆర్థిక అక్షరాస్యత పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏపీజీవీ బ్యాంకు ఆర్‌ఓ ఎఫ్ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలపై ప్రతీ ఖాతాదారుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. సంస్థ కోఆర్డినేటర్ ఈదునూరి రమేశ్, పొదుపు సంఘాల ప్రతినిధులు పద్మ, నాగరాణి, మాధవి, సునీత, లలిత, కీర్తన, రైతులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

'చల్లా' హ్యాట్రిక్ ఖాయం

ఆత్మకూరు: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గెలుపొంది హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని మాజీ ఏఎంసీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి అన్నారు. మండలంలోని నాగయ్యపల్లెలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు సౌకర్యాలు కల్పించిన ధర్మారెడ్డిని మళ్లీ గెలిపించాలని ప్రజలను కోరారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే వంద రోజుల్లో ప్రజలకు పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందించనున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 6, 13, 14 వార్డుల్లో గురువారం గడపగడపకు కాంగ్రెస్.. ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, మాజీ వార్డు సభ్యుడు నాడెం స్వరూపనాగేశ్వర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతల సాంబరెడ్డి, పట్టణ సెక్రటరీ మోటం రవికుమార్, గొర్రె నవీన్, కొలువుల వెంకటేశ్వర్లు, దేశిసాయి పటేల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి

కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లి వివరించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. 43వ డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మామునూరులో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపు నల్లేరుపై నడకే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణతోపాటు నాయకులు పాల్గొన్నారు. అలాగే, జక్కలొద్దిలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే రమేష్ ప్రారంభించారు. 43, 44వ డివిజన్ జక్కలొద్ది, తిమ్మాపురం గ్రామాలకు చెందిన పలువురు ఇటీవల అనారోగ్యాలతో మరణించగా, వారి కుటుంబాలను పరామర్శించారు.

అరూరికి రొట్టెబండ ప్రజల ఏకగ్రీవ తీర్మానం

మడికొండ: వర్ధన్నపేట బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ప్రశాంత్‌నగర్‌లోని ఆయన నివాసంలో కాజీపేట మండలం మడికొండ శివారు రొట్టెబండ ప్రజలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వల్లెపు ఉపేందర్ పాల్గొన్నారు.


'అవినీతిపరులను ఓడించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

నర్సంపేట : సామాజిక న్యాయం జరగాలంటే అవినీతి, అవకాశవాదులను ఓడించాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి, నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దారపు రమేష్ కోరారు. ఈ మేరకు పట్టణంలోని 1వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం రాత్రి పేదలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ఫాసిస్టు, నియంతృత్వ విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీజేపీ అనుకూల విధానాన్ని బలపరుస్తోందని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ తీసుకొచ్చిన ఆర్థిక విధానాలను ప్రస్తుతం బీజేపీ, బీఆర్‌ఎస్ అమలు చేస్తున్నాయని తెలిపారు. దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా బీఎల్ఎఫ్ అభ్యర్థులను గెలిపించుకొని చట్టసభలకు పంపించి రాజ్యాధికారం సాధించాలని పిలుపునిచ్చారు. నర్సంపేట ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐ (యూ) డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజాసాహెబ్, బీఎల్ఎఫ్ నియోజకవర్గ కన్వీనర్ వంగల రాగసుధ, స్థానిక నాయకులు జన్ను జమున, నకిన బోయిన మహేష్, ఆరీఫ్, రాజు, మల్లేష్, అఖిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమాచార్యులు

నర్సంపేట : బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని విశ్వబ్రాహ్మణ పూజారుల సంఘం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ అధ్యక్షుడు కారంపూడి కృష్ణమాచార్యులు, వాస్తుబ్రహ్మ బెజ్జంకి బ్రహ్మచారి, ఖాజీలు నవమన్, అబ్దుల్లా, అజీజుద్దీన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని విజ్డమ్ స్కూల్‌లో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్ అధ్యక్షతన గురువారం వరంగల్, హనుమకొండ జిల్లాల మత పెద్దలతో బాల్య వివాహాల నిర్మూలన కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి గర్ల్స్ అడ్వకసీ యాక్షన్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలన కోసం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు చేయడానికి ప్రయత్నం చేసే వారికి పూర్తిగా కౌన్సెలింగ్ ఇచ్చి నిరోధిస్తున్నామని వివరించారు. దేవాలయాలు, మసీదులు, పాఠశాలలు, కార్యక్రమాల్లో అన్ని వర్గాల ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడానికి నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ బత్తుల కరుణ మాట్లాడుతూ వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్ జిల్లాల్లోని మత పెద్దల సహకారంతో బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలన కరపత్రాలు, సైన్ బోర్డులను ఆవిష్కరించారు. సమావేశంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవాసంస్థ ఫీల్డ్ కో ఆర్డినేటర్ బెజ్జంకి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నివాళులర్పిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి : మండలంలోని పలు గ్రామాల్లో మృతిచెందిన వారి కుటుంబాలను గురువారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు. మండలంలోని పెర్కవేడుకు చెందిన గొడుగు స్వప్న మృతిచెందగా ఆమె మృతదేహం వద్ద మంత్రి నివాళులర్పించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన బొమ్మెర అహల్య, గుంటూరుపల్లికి చెందిన వీరగంధం సుబ్బారావు, రాయపర్తికి చెందిన ఐత యాకూబ్ కుటుంబ సభ్యులను ఎర్రబెల్లి పరామర్శించారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో బిల్లా సుధీర్‌రెడ్డి, పూస మధు, సర్పంచ్‌లు గారె నర్సయ్య, చిన్నాల తారశ్రీరాజబాబు, ఐత రాంచందర్, బండి అనూషరాజబాబు, బిల్లా రాధికసుభాష్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

రాయపర్తి మండలంలోని శివరామపురం, కొలన్‌పల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు గురువారం పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబాలను ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీలు ఉన్నారు.